జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక


చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 19-11-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 168 పేజీలు: 8 వెల: రూ.7



## రాజకీయ నేతగా..
# నిరుద్యోగులకు టోకరా..!

**✳ స్మార్ట్ విలేజ్ గ్రూపులో ఉద్యోగాలంటూ మోసం ✳ ఒక్కో నిరుద్యోగి నుంచి మూడు లక్షలు వసూలు ✳ సీడాప్ చైర్మన్‌గా ఉన్న సమయంలో శ్యాం ప్రసాద్ రెడ్డి అవినీతి ✳ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మత్స్యకారులకు గాలం ✳ నకిలీ అపాయింట్మెంట్ పత్రాలతో మోసం ✳ వేరే అకౌంట్ నెంబర్లు ఇచ్చిన వైనం ✳ ఆనక సంబంధం లేదని నాలుక మడతెట్టిన మాజీ చైర్మన్ ✳ బాధితులు కపాసుకుద్ది మత్స్యకార యువకులు ✳ కవిటి పోలీస్ స్టేషన్లో గతంలో ఫిర్యాదు ✳ అధికారంలో ఉండటంతో తప్పించుకున్న వైనం ✳ ప్రభుత్వం మారడంతో తెర మీదకు వ్యవహారం ✳ తమకు న్యాయం చేయాలంటున్న బాధితులు ✳ ఫిర్యాదు అనంతరం కొంతమేర చెల్లింపు ✳ మిగిలిన డబ్బులకు మీనమేషాలు ✳ ఎస్పీ దృష్టికి తీసుకు వెళ్లేందుకు బాధితులు సిద్ధం**





ఫిర్యాదు కాపీ

**గడచిన ఐదేళ్ల పాలనలో ఎవరికి దొరికిన కాడికి వారు దండిగా దండుకున్నారు..! కొందరు వనరులు కొల్లగొడితే.. మరికొందరు నిరుద్యోగుల ఆశలను తమకు అనుకూలంగా మలుచుకున్నారు. కార్పొరేషన్‌కి చైర్మన్‌గా ఉన్నాను కాబట్టి నేను అనుకుంటే మీకు పాతికవేల రూపాయల జీతంతో ఉద్యోగాన్ని ఇట్టే ఇవ్వగలను అంటూ నిరుద్యోగులకు గాలం వేశారు. సముద్ర వేటపై జీవనోపాధిని పొందుతున్న ఆ మత్స్యకారులు ఈ ముచ్చటైన మాటలను విని ఆలోచించకుండా ఉద్యోగ భద్రత ఏర్పడుతుందని అడిగిన మూడు లక్షలు ఇచ్చేశారు. అనంతరం అపాయింట్మెంట్ లెటర్ ఈరోజు రేపు అంటూ సదరు రాజకీయ నేత కాలక్షేపం చేశారు. నిరుద్యోగ యువకుల నుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో చివరకు, వారిని విశాఖకు రప్పించుకున్నారు. స్మార్ట్ విలేజ్ కార్పొరేషన్‌లో ఉద్యోగాలంటూ అని చెప్పిన సదరు నేత నాలుగు దిక్కులు తిప్పి, అతను మనకు మోసం చేశారంటూ నెపాన్ని వేరే వాళ్ల పైకి స్మార్ట్‌గా నెట్టేశారు. దీంతో ఏం చేయాలో తోచక మత్స్యకార నిరుద్యోగులు కొద్ది రోజులు వేచి చూసి కవిటి పోలీస్ స్టేషన్‌లో సదరు రాజకీయ నేతపై ఫిర్యాదు చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో ఆ నేతను పోలీసులు కూడా టచ్ చేయలేకపోయారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో ఆ నిరుద్యోగ యువకులు ఎస్పీని ఆశ్రయించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ తరుణంలో 'వార్త' పరిశీలనకు వచ్చిన అంశమే ఈనాటి కథనం..!!**



**శ్రీకాకుళం, నవంబర్ 18 (వార్త):** ఇచ్చాపురం నియోజకవర్గానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేత, మాజీ సీడాఫ్ చైర్మన్, నియోజకవర్గ మాజీ సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి కవిటి మండలం కపాసుకుద్ది గ్రామానికి చెందిన నలుగురు నిరుద్యోగుల వద్ద నుంచి మూడు లక్షల చొప్పున ఉద్యోగాల పేరిట వసూలు చేశారు. స్థానిక సర్పంచ్ మధ్యవర్తిత్వంలో ఈ వ్యవహారం నడిచింది. నేరుగా శ్యామ్ ప్రసాద్ రెడ్డి డబ్బులు ముట్టుకోకుండా, కొందరి వేరే వ్యక్తుల అకౌంట్ నెంబర్లు, ఫోన్ పే నెంబర్లు ఈ నిరుద్యోగులకు ఇచ్చి.. అందులో డబ్బులు జమ చేయించుకున్నారు. పలుమార్లు, కొంత కొంత చొప్పున వారి వారి ఖాతాలకు జమ చేయించుకున్నారు. చెప్పిన గడువు ముగిసిపోయిన ఉద్యోగాలు ఊసే లేదు. గట్టిగా అడిగితే, డబ్బులు తనకు ఇచ్చారా అంటూ దబాయించడం మొదలుపెట్టారు. స్థానిక సర్పంచి సహకారంతో మత్స్యకారులు తీవ్ర ఒత్తిడి చేస్తే, మన దగ్గర డబ్బులు పట్టుకుపోయిన వ్యక్తి ఫలానాచోట ఉన్నారంటూ, అక్కడికి వెళ్లి అపాయింట్మెంట్ లెటర్ తీసుకొద్దాం అంటూ మరోసారి వారిని మోసం చేశారు. పలు గ్రామాలు తిప్పుతూ చెల్లని అపాయింట్మెంట్ లెటర్లను ఈ నిరుద్యోగ యువకులకు అందించారు. వారు పొందిన ఉద్యోగ పత్రాలు నకిలీవని తెలిసి, మళ్లీ శ్యాం ప్రసాద్ రెడ్డి పై ఒకరకంగా చెప్పాలంటే దూకుడుగానే మత్స్యకార నిరుద్యోగులు వ్యవహరించారు. ఇక చేసేది లేక, వాడు మనల్ని మోసం చేశాడంటూ మొసలి కన్నీరు కార్చి చేతులు దులిపేసుకున్నారు. అప్పులు చేసి ఉద్యోగం కోసం కట్టిన డబ్బులు ఇక రావని, బాధితులు గ్రహించి తేల్చుకునేందుకు పోలీస్ స్టేషన్‌కు




9. Particulars of properties stolen/involved (Attach separate sheet, if necessary)
Cash
10. Total value of properties stolen/involved
11. Inquest Report/ U.D. Case No., if any
12. First Information contents (Attach separate sheets, if required)
Original Complaint is here with
Action taken: Since the above information reveals commission of offence(s) u/s as mentioned at Item No.2.
1) Registered the case and took up the investigation or
2) Directed (Name of I.O.) ............ Rank ............ No. ............ to take up the investigation or
3) Refused investigation due to ............
4) Transferred to P.S. ............ District ............
F.I.R. read over to the Complainant/Informant, admitted to be correctly recorded and a copy given to the Complainant/Informant, free of cost.
A.C.

పోయి కేసు పెట్టారు. అయితే అధికార పార్టీ అండదండలు ఆరోజు ఉండడంతో శ్యాం ప్రసాద్ రెడ్డి తప్పించుకున్నారు. మధ్యవర్తిత్వం ద్వారా కొంత డబ్బును తిరిగి ఆ నిరుద్యోగ యువకులకు ఇచ్చారు. మిగిలిన డబ్బులు ఊసు గాని జాడగాని ప్రస్తుతం లేకపోవడంతో, ఆ నిరుద్యోగ యువకులు మళ్లీ ఎస్పీని ఆశ్రయించేందుకు సన్నద్ధమవుతున్నట్టు 'వార్త'కు ఉప్పందింది. గత ప్రభుత్వమైన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండదండలతో అధికారంలో ఉన్నన్నాళ్ళు ఏమైనా చేసేస్తామంటూ నిరుద్యోగ యువకులకు చేసిన ఈ మోసంపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని వారంతా కోరుతున్నారు..!

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు రెడ్‌క్రాస్ చేయూత



**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 18 (వార్త):** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ అరసవల్లిలో కాపు వీధిలో ఉన్న అగ్ని ప్రమాద బాధితులకు కిచెన్ సెట్లు, టార్పలిన్ సీట్స్, దోమతెరలు, చీరలు, తువ్వాలు, ఉన్ని దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ బలివాడ మల్లేశ్వరరావు, సభ్యులు బి.చిన్నమయిరావు, ఉంగటి రమణ, వీఆర్వో లీల ప్రసన్న, గొలివి రమణ, ఉమాశంకర్, వెంకట రమణ, గోపి పాల్గొన్నారు.

# పైసా వసూల్.. నాయుడు



* నిబంధనలకు విరుద్ధంగా ఇచ్ఛాపురం మార్కెట్ కమిటీలో సెస్ వసూళ్లు * లారీ యజమానులు, వ్యాపారులతో లాలూచీ * పైఅధికారులకు వాటాలు * ఇచ్ఛాపురం, పలాస ఏఎంసీలో చక్రం తిప్పుతున్న చిరుద్యోగి

**శ్రీకాకుళం క్రైం, నవంబర్ 18 (వార్త):** ఇచ్ఛాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీలో వసూళ్ల దందా ఆగడం లేదు. దిగువ స్థాయి సిబ్బంది అక్రమ వసూళ్లకి పాల్పడుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం రవాణా ప్రారంభం కావడంతో వసూళ్లు అధికం అవుతున్నాయి. ధాన్యంపై ఒక శాతం సెస్ వసూలు చేయాలి. అలాగే జీడిపప్పు, వేరుశెనగ ఇతర అన్ని వ్యవసాయ ఉత్పత్తులపై సెస్ వసూళ్లు చేయాలి. నిబంధనల మేరకు సెస్ వసూలు చేయడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా సెస్ వసూలు చేస్తూ జేబులు నింపేసుకుంటున్నారు. పై స్థాయి అధికారులు అండదండలు ఉండడం, ఎవరి వాటాలు వారికి అందుతుండడంతో అందరూ గప్‌చుప్‌గా ఉంటున్నారు. ఒడిశాలో ధాన్యానికి కనీస మద్దతు ధర పెరగడంతో ఈ ఏడాది ధాన్యం రవాణా తగ్గవచ్చు అనే కారణంగా జీడిపప్పు, వేరుశెనగ లోడ్లపై వీరి కన్ను పడింది. ప్రతి లోడుపై 5 వేలు నుంచి 10 వేలు వరకు ముడుపులు తీసుకుని వదిలేస్తున్నట్లు సమాచారం. గతంలో పనిచేసిన ఉద్యోగి మరణంతో కుమారుడికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం వచ్చింది. దిగువ స్థాయి ఉద్యోగం నుంచి పదోన్నతి పొంది బదిలీపై ఇచ్ఛాపురం వచ్చి చక్రం తిప్పుతున్నాడు. గతంలో పనిచేసిన పలాసలో పరిచయాలు, అక్కడ లోగుట్టు తెలియడంతో ఈ రెండు మార్కెట్ కమిటీలలో లక్షలాది రూపాయలు అవినీతికి తెరలేపారు. పలాసలో ఒక సెక్యూరిటీ గార్డుని చేతిలో పెట్టుకుని అక్రమంగా దందా సాగిస్తున్నారు. లారీ యజమానులు, వ్యాపారులతో నేరుగా సంప్రదింపులు జరిపి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం పాలక వర్గాలు లేకపోవడంతో వీరి దందాకి మరింత బలం చేకూరింది.



## స్వచ్ఛభారత్ మిషన్
# లక్ష్యాలను సాధించాలి

* అందరికీ సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యం
* బహిరంగ మలవిసర్జన లేకుండా చూడాలి
* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశం

**శ్రీకాకుళం, నవంబర్ 18 (వార్త):** ప్రతీ కుటుంబానికి సురక్షితమైన తాగునీరు జల్ జీవన్ మిషన్ ద్వారా అందించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. జల్‌జీవన్ మిషన్, స్వచ్ భారత్ మిషన్ గ్రామిన్, డిస్ట్రిక్ట్ వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ అంశాలపై ఆయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తో కలసి సోమవారం సమీక్షించారు. స్వచ్ భారత్ మిషన్ గ్రామిన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతను మెరుగు పరచుట, పరిశుభ్రమైన పరిసరాలను నిర్వహించుట, మహిళల ఆత్మ గౌరవానికి భంగం కలుగకుండా ప్రతీ ఇంటికి మరుగుదొడ్లు ఉండేటట్టు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీని కోసం పంచాయతీరాజ్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ప్రజలను చైతన్య వంతులుగా చేయాలని కోరారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ద్వారా భూగర్భ జలాలు పెంచే నిర్మాణాలు కట్టడాలు చేపట్టాలని తెలిపారు. జిల్లా పరిషత్ ద్వారా 15వ ఆర్థిక సంఘం నిధులతో పైపులైన్లు, నీటిశుద్ధి యూనిట్లు ఏర్పరచాలని డ్వామా ద్వారా స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు సహకారంతో వీటిపై ప్రజలను చైతన్య వంతులు చేయాలని పేర్కొన్నారు. జన సంచారం ఎక్కువగా ఉండే బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, ఆసుపత్రులు, బహిరంగ ప్రదేశాలు, దేవాలయ ప్రదేశాలు, తదితర ప్రదేశాల్లో మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం వెంకటేశ్వరరావు, డీపీవో కె.భారతి సౌజన్య, జడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజా, డీఆర్డీఏ పీడీ కిరణ్ కుమార్, డ్వామా పీడీ సుధాకర్, డీఎంహెచ్ఓ డాక్టర్ బి.మీనాక్షి, డీఐపీఆర్వో కె. చెన్నకేశవరావు, గ్రౌండ్ వాటర్ డిడి రమణమూర్తి, వ్యవసాయ శాఖ జెడి త్రినాథ స్వామి పాల్గొన్నారు.

## గ్రంథాలయానికి
# మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



**శ్రీకాకుళం టౌన్, నవంబర్18 (వార్త):** ఎర్రన్న విద్యాసంకల్పం కింద జిల్లా కేంద్ర గ్రంథాలయానికి పుస్తకాల బీరువాతో పాటుగా పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అందజేశారు. సోమవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ పితామహుడు, ఎర్రన్నాయుడు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. గ్రంథాలయానికి ఎక్కువమంది యువత వస్తున్నందున ఎర్రన్న విద్యాసంకల్పం కింద పోటీపరీక్షలకు అవసరమైన పుస్తకాలు సమకూర్చామన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ గ్రంథాలయంలో విద్యార్థులు పుస్తకాలు చదివి ప్రభుత్వ పోటీ పరీక్షలలో విజయాన్ని సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఉత్తమ గ్రంథపాలకులు ఎం.చంద్రశేఖర్, జి.గోవిందరావు, కె.చిరంజీవులు, ఎన్.చాయారతన్, కాళ్లరాజు, ఎస్.వీ.రమణ మూర్తికి మంత్రి సత్కరించారు. కార్యక్రమం శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు, గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ వీవీజీఎస్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ భాస్కర రాజా, గ్రంథాలయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అమ్మాయిలు.. ధీటుగా రాణించండి

* విమానయాన రంగంలో ఉన్న అవకాశాలను వినియోగించుకోండి * కొత్త ఎయిర్ పోర్టుల నిర్మాణంతో జిల్లాలో ఉపాధి అవకాశాలు * కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు * మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా ఉమెన్ ఇన్ ఏవియేషన్ డే

**శ్రీకాకుళం, నవంబర్ 18 (వార్త):** ప్రపంచ వ్యాప్తంగా కేవలం 5శాతం మంది మాత్రమే మహిళా పైలెట్లు ఉండగా, మన దేశంలో 15శాతం మంది ఉండడం గమనార్హమని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. దీనిని 25 శాతానికి పెంచడమే తన లక్ష్యమని తెలిపారు. అకాశంలో సగం అనే నినాదం నుంచి అవకాశాల్లో కూడా సగం అనే దిశగా యువతులు మరింత ధీటుగా సన్నద్ధం కావాలని కోరారు. ఉమెన్ ఇన్ ఏవియేషన్ ఇండియా ఆధ్వర్యంలో శ్రీకాకుళం మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఉమెన్ ఏవియేషన్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. చిన్నప్పుడు ఆకాశంలో విమానం చూసి, ఆనందించిన ప్రతి ఒక్కరూ.. అదే విమానయాన రంగంలో పని చేస్తే వచ్చే అనుభూతిని తెలుసుకోవాలన్నారు. శ్రీకాకుళం జిల్లా ప్రజలు ఎక్కడ ఉన్నా కష్టపడి పని చేసే లక్షణం ఉన్నవారని, దీనికి మరింత నైపుణ్యం జోడిస్తే మరింతగా రాణిస్తారని చెప్పారు. భేటీ కీ ఉడాన్... దేశ్ కా స్వాభిమాన్ అనేది విమానయాన శాఖ ధ్యేయమని, యువతులను విమానయాన శాఖలోని మరిన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు సహకారం అందిస్తున్నామని తెలిపారు. భోగాపురం ఎయిర్ పోర్టుతో పాటు మూలపేట పోర్టు సమీపంలో మరో విమానాశ్రయం నిర్మాణంతో జిల్లాలోని యువతీ, యువకులకు ఎన్నో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. పైలెట్, ఎయిర్ హోస్టెస్, కస్టమ్స్, ఇంజినీరింగ్, ఇమ్మిగ్రేషన్ సహా ఎన్నో విభాగాల్లో మహిళలకు గల అవకాశాలను వివరించారు. దీనిపై దేశవ్యాప్తంగా 30 నగరాల పరిధిలో దాదాపు 30వేల మంది విద్యార్థినులను కలిసి, అవగాహన కల్పిస్తున్న ఉమెన్ ఇన్ ఏవియేషన్ సభ్యులను అభినందించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ మాట్లాడుతూ జిల్లాలోని విద్యార్థులను విమానయాన రంగం వైపు ప్రోత్సహించేలా వినూత్న కార్యక్రమం నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. సంస్థ ఉపాధ్యక్షురాలు కమల చక్రవర్తి, సభ్యులు అంజలి చౌహాన్, అర్చన, కీర్తి తివారి తదితరులు అతిథులను సత్కరించారు. అంతకు ముందు ఎన్‌సీసీ విద్యార్థినుల నిర్వహించిన గార్డ్ ఆఫ్ ఆనర్, గౌరవ కవాతు స్వీకరించారు. 'అమ్మ పేరుతో ఒక మొక్క' కార్యక్రమంలో భాగంగా గాంధీ విగ్రహం వద్ద మొక్క నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు, టీడీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మెండ సుజాత, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు మెండ దాస్ నాయుడు, నాయకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## రావాడపేట కాలనీలో చోరీ

**నరసన్నపేట, నవంబర్ 18(వార్త):** రావాడపేట జగనన్న కాలనీలోని బైక్ మెకా నిక్ ముంగి శాంతారావు ఇంట్లో శనివారం దొంగలు చోరీకి పాల్పడ్డారు. రూ.1.95 లక్షలు దొంగిలించారు. ఈ మేరకు శాంతారావు నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## వ్యవసాయ బడ్జెట్ రైతులకు వరం



**నరసన్నపేట, నవంబర్ 18(వార్త):** వ్యవసాయ బడ్జెట్ రాష్ట్రంలోని రైతులకు ఉపయోగపడేలా ఉందని, ఇది ఎంతో ఆనందదాయకమని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. శాసనసభలో సోమవారం ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన యాంత్రిక పరికరాలను రాయితీ ద్వారా అందించాలని కోరారు. ఈ బడ్జెట్ రైతులకు ఒక వరం లాంటిదని కొనియాడారు.

# లోక్ అదాలత్‌కు సహకరించండి



**పలాస, నవంబర్ 18(వార్త):** పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సోమవారం పలాస, కోటబొమ్మాళి న్యాయమూర్తులు యు.మాధురి, ప్రసన్నలత పలాస బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌కు సహకరించాలని కోరారు. పలు విషయాలపై న్యాయవాదులతో చర్చించారు. అనంతరం పలాస మేజిస్ట్రేట్‌గా నియమితులైన మాధురికి, ఇప్పటివరకు ఇన్‌చార్జి మేజిస్ట్రేట్‌గా వ్యవహరించిన కోటబొమ్మాళి మేజిస్ట్రేట్ ప్రసన్నలత బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు విశ్వేశ్వర రావు, సెక్రటరీ పిండి వెంకటరావు, జాయింట్ సెక్రటరీ అనిల్ రాజు, వైస్ ప్రెసిడెంట్ ఫయాజ్‌అహ్మద్, సీనియర్ న్యాయవాదులు లక్ష్మీనారాయణ, తాండ్ర మురళీమోహన్, కోత రజనీకుమార్, జి.ప్రభాకర్‌రావు, చిట్టిబాబు, తేజేశ్వరరావు, రవికుమార్ శ్యామ్, దేవరాజు, విఘ్నేశ్వరరావు, సూపరింటెండెంట్ కృష్ణారావు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకోండి




మందసలో మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు

**మందస, నవంబర్ 18(వార్త):** విజయవాడలో డిసెంబర్ 4న జరిగే ప్రజాహక్కుల ర్యాలీని విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) నాయకులు మద్దిల రామారావు, కుత్తుం దుష్యంత్, వంకల అప్పయ్య, కొనారి ఈశ్వరమ్మ, సార పాపయ్య, ఈశ్వరరావు, కోదండం కోరారు. సోమవారం వారు మందసలో ఈ మేరకు ప్రచారం చేశారు. సూపర్ సిక్స్‌తో పాటు, ప్రజల మనుగడకు కావాల్సిన పీపుల్స్ సిక్స్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలను ఇచ్చినంత మాత్రాన జీవితాలు బాగుపడవని, ప్రజల జీవిత స్థిరత్వానికి కావాల్సిన శాశ్వత పరిష్కారాలు చూపాలని అఖిల భారత కిసాన్ మహా సభ జిల్లా కన్వీనర్ మద్దిల రామారావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడి, ప్రైవేటీకరణ విధానాలను వీడాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని పటిష్టపరిచి, కేంద్రం నిధులు మంజూరు చేయాలన్నారు. ఈ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానంచేయాలని డిమాండ్ చేశారు. అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీసం రూ.35వేల వేతనం చెల్లించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు పాల్గొన్నారు.

# గ్రామాల వారీగా పంటల బీమా చెల్లించాలి



తహసీల్దార్ హైమావతికి వినతిని అందజేస్తున్న రైతు నాయకులు

**మందస, నవంబర్ 18(వార్త):** గ్రామాల వారీగా పంటల బీమా పరిగణనలోకి తీసుకుని, నష్టపరిహారం చెల్లించాలని మహేంద్ర, చైతన్య రైతు సంఘం నాయకులు కోరారు.

సోమవా రం వారు మందస తహసీల్దార్ హైమా వతికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ ఏడాది వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో అతి కష్టమ్మీద వరినాట్లు వేశామన్నారు. చాలా పొలాల్లో నీరులేక పంట ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

వరి పంటకు గిట్టుబాటు ధర చెల్లించి, ప్రభుత్వమే నేరుగా కళ్లాల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలన్నారు. తేమ పేరుతో రైతుల వద్ద నుంచి రెండు నుంచి 10 కిలోల ధాన్యాన్ని మిల్లర్లు దోచుకుంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధాన్యం గన్నీలను ప్రభుత్వమే అందించాలని, సంకుజోడు, అసర్ల చెరువు, గోపాలసాగరం, జెన్నా చెరువు, బాలిగాం, కొత్తచెరువు, మందస రాజబంద, పింపిడియా పెద్దచెరువుల పూడికలను తీసి, ఆక్రమణలను తొలగించాలని కోరారు. మదుములు, ఘోరీలు మరమ్మతులు చేయాలన్నారు. అపరాల విత్తనాలు పెసలు, మినుములు, నువ్వులు, చిరు ధాన్యాలు 90శాతం రాయితీపై రైతులకు అందివ్వాలని, దామోదర సాగరం జలాశయం కుడికాలువను వాసుదేవపురం, అచ్యుతాపురం, కుంటికోట, కమలాపురం, బాలిగాం వరకు పొడిగించాలని, జీడి, కొబ్బరి బోర్డులు ఏర్పాటు చేసి, గిట్టుబాట ధర కల్పించాలన్నారు. ఉపాధి హామీపథకాన్ని వ్యవసాయానికి అన్ని పంటలకు అనుసంధానం చేయాలని కోరారు.

కార్యక్రమంలో బెస్త కామేశ్వరరావు, మామిడి మాధవ రావు, రైతు నాయకులు పాల్గొన్నారు.



## ఉన్నత శిఖరాలు అధిరోహించండి

**మెళియాపుట్టి, నవంబర్ 17(వార్త):** విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యాశాఖాధికారులు దేవేంద్రరావు, పద్మనాభం ఆకాంక్షించారు. శాఖా గ్రంథాలయాధికారిణి అనురాధ ఆధ్వర్యంలో సోమవారం మెళియాపుట్టి గ్రంథాలయంలో యువతపై మాదకద్రవ్యాల ప్రభావం అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనాన్ని అలవర్చుకొని విజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ సనపల భారతి, నలంద పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌కు బీరువా వితరణ



**పాతపట్నం, నవంబర్ 18(వార్త):** పాతపట్నం ఆదర్శ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న వండాన హేమని, ఇంటర్ చదువుతున్న బూడిద భానుశ్రీ తల్లిదండ్రులు వండాన గంగాధర్, బూడిద నాగరాజు కలిసి వసతిగృహానికి బీరువా వితరణగా అందించారు. వీరిని ప్రిన్సిపాల్ రత్నకుమారి, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాదరావు, వార్డెన్ త్రివేణి, ఉపాధ్యాయులు అభినందించారు.

## విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



**మందస, నవంబర్ 18(వార్త):** గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మందస గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. గ్రంథాలయం సహాయకుడు ఆర్.మోహన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. కార్యక్రమంలో లైబ్రేరియన్ జె.విజయలక్ష్మి, సూర్యోదయ స్కూల్ పీఈటీ ఎం.ధర్మారావు, పాఠకులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ పనివేళలు మార్చండి

**నరసన్నపేట, నవంబర్ 18(వార్త):** గ్రంథాలయ పనివేళల్లో మార్పులు చేపట్టాలని పలువురు నిరుద్యోగ యువత కోరారు. నరసన్నపేటలోని గ్రంథాలయంలో సోమవారం వారు మాట్లాడారు. పని వేళలు మార్చితే తమకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగించాలని కోరారు.



## కటక్ బాలి యాత్రకు సిక్కోలు బృందం

**జలుమూరు, నవంబర్ 18(వార్త):** కటక్‌లో జరుగుతున్న బాలియాత్ర అధ్యయనా నికి సిక్కోలు బృందం సోమవారం పయనమైంది. వచ్చే ఏడాది శ్రీముఖలింగంలో జరగనున్న బాలియాత్రలో కటక్ విధానాలను అవలంభించడానికి పలాస నుంచి ఈ బృందం వెళ్లింది. ఈ బృందం డా. దువ్వాడ జీవితేశ్వరరావు, డా.దొర, బొడ్డేపల్లి శ్రీరామ్, బి.నేతాజీ, చందు భరద్వాజ్ తదితరులు ఉన్నారు.





## అంగన్‌వాడీ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

**నరసన్నపేట, నవంబర్ 18(వార్త):** అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న బాలల ఆరోగ్య సురక్షాలో భాగంగా విద్యార్థులకు పలు పరీక్షలను చేపట్టామని ఐసీడీఎస్ పీవో నాగమణి తెలిపారు. సోమవారం నరసన్నపేటలోని మారుతినగర్ అంగన్ వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. 93 మంది చిన్నారులు బరువు తక్కువగా ఉండడాన్ని గుర్తించారు. వీరికి పౌష్టికాహారం అందిస్తామని పీవో తెలిపారు.

## ఆధార్ కేంద్రాల వద్ద క్యూ



**నరసన్నపేట, నవంబర్ 18(వార్త):** ఆధార్ కేంద్రాల వద్ద రద్దీ నెలకొంది. నరసన్నపేటలోని స్థానిక పోస్టాఫీస్ వద్ద ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రం వద్ద లబ్ధిదారులు బారులు తీరి ఉండడం కనిపించింది. పదేళ్లు దాటిపోయిన వారి ఆధార్ కార్డుల్లో మార్పులు చేయాల్సి ఉండడంతో పలువురు కేంద్రాల వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

## నిరుపేదలకు ఇళ్ల స్థలాలు అందించండి



**నరసన్నపేట, నవంబర్ 18(వార్త):** నిరుపేదలకు ఇళ్ల స్థలాల పట్టాలను తక్షణమే అందించాలని సీపీఐ జిల్లా ప్రతినిధి కొండ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన నరసన్నపేట పంచాయతీ కార్యాలయం వద్ద మహిళలతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్క గ్రామీణ ప్రాంత నిరుపేదకు మూడు సెంట్లు ఇంటి స్థలాన్ని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈవోకు వినతిపత్రం సమర్పించారు.

## కళాకారుడు ధనంజయరెడ్డికి ఘన సన్మానం

**ఇచ్ఛాపురం, నవంబర్ 18(వార్త):** కవిటి మండలం కపాశకుద్దిలోని రామలింగేశ్వర ఆలయంలో సోమవారం ఇచ్ఛాపురం మండలం టి.బరంపురం గ్రామానికి చెందిన ప్రముఖ జానపద సంగీత కళాకారుడు తిప్పన ధనంజయ రెడ్డి గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాయ భీమసేన్, పెద్దలు తోట ధర్మరాజు, చలపరాయి ఏకాంబరం, కూర్మారావు, అర్చకులు నిరంజన్, శంకర్, తోట రామారావు, చిట్టిబాబు, కూర్మరావుదాస్, చలపరాయి వినోద్‌కుమార్, పొందల శ్రీనివాస్ , జయదేవ్, గోపాల్, నియోజకవర్గ కళాకారులు, గ్రామ పెద్దలు రామలింగేశ్వర యువజన సంఘం, గ్రామ పురజనులు తదితరులు పాల్గొన్నారు.



### పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ..

# సమస్యలను పరిష్కరించండి

**పలాస, నవంబర్18(వార్త):** పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష డిమాండ్ చేశారు. సోమవారం ఆమె శాసనసభలో ఈ విషయమై ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కిడ్నీ సమస్యతో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని వాపోయారు. కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లో కనీస సదుపాయాలు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సెంటర్‌పై కనీసం 700 గ్రామాలు, రెండు లక్షల మంది ప్రజలు ఆధారపడి ఉన్నారన్నారు. ఈ కిడ్నీ సెంటర్‌కు కనీసం 73 మంది వైద్యులు అవసరం కాగా, ప్రస్తుతం కేవలం 17 మంది మాత్రమే ఉన్నారన్నారు.కేవలం 10డయాలసిస్ కేంద్రాలు ఉన్నాయని, ఇవి సరిపోవని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ ఆసుపత్రిపై ఆ శాఖ మంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపించి, జిల్లాలో పర్యటించి, కలెక్టర్‌తో చర్చించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఉద్దానం ప్రజల రుణాన్ని ఈ ప్రభుత్వం తీర్చుకోవాల్సి ఉందన్నారు.



### ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు..

# సమరశీల పోరాటాలకు సన్నద్ధం




**కాశీబుగ్గ, నవంబర్ 18(వార్త):** ఏఐఎస్ఎఫ్ 20వ జిల్లా మహాసభను పలాసలో సోమవారం నిర్వహించారు. వందలాది విద్యార్థులతో భారీ ర్యాలీ, కాశీబుగ్గ బస్టాండ్ నుంచి కీర్తన ఫంక్షన్ హాల్ వరకు సాగింది. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రవి అధ్యక్షతన నిర్వహించిన సభలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు మాట్లా డుతూ పొత్తిళ్లలోనే పిడికిలి బిగించి దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానంతో పేదలకు విద్య అందని ద్రాక్ష లాగా తయారవుతుందన్నారు. ఇప్పటికే రేషనలైజేషన్ పేరుతో దేశవ్యాప్తంగా 60 వేల ప్రభుత్వ పాఠశాలలను హైస్కూల్లో విలీనం చేశారని, దీంతో లక్షలాది మంది విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. సెంట్రల్ యూనివర్సిటీలు, జాతీయ విద్యా సంస్థల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి సీట్ల సంఖ్యను కుదించి వేయడంతో ఉన్నత విద్య మరింత ఖరీదుగా తయారవుతుందన్నారు. యువగళం పాద యాత్రలో నారా లోకేష్ జీవో నెం77ను రద్దు చేస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట మీద నిలబడి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌కు సొంత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మెటిక్ చార్జీలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ కాషాయీకరణకు వ్యతిరేకంగా, ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ కోసం రాబోయే రోజుల్లో సమరశీల పోరాటాలకు సన్నద్ధమవుతున్నామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకుడు ముద్దాడ యుగంధర్ మాట్లాడుతూ ఉన్నత విద్యా రంగంలో జరిగే అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు మౌలిక వసతులు కల్పనకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రాము, సూర్య, విజయ్, గుణశేఖర్ చిరు, హరిప్రసాద్, మహేష్, సాయి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు

**మందస, నవంబర్ 18(వార్త):** విద్యార్థులు చక్కగా చదువుకోవాలని, మాదక ద్రవ్యాలకు బానిస కావద్దని కాశీబుగ్గరూరల్ సీఐ ఎం.తిరుపతి కోరారు.

మందసలోని ప్రభుత్వ జూని యర్ కళాశాలలో సంకల్పం పేరుతో మాదక ద్రవ్యాలపై అవగాహనా సమా వేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసు కుని, జీవితాలను ఉన్నత శిఖరాలకు తీసుకుపోవాలన్నారు.

మాదక ద్రవ్యా లతో కుటుంబాలు, జీవితాలు నాశనమ వుతాయని, వాటి వైపు కన్నెత్తి కూడా చూడకూడదన్నారు. తల్లిదండ్రుల ఆశ లను వమ్ము చేయవద్దని, చెడు దారి వైపు పయనించకూడదన్నారు. చట్టాలు కఠినంగా ఉన్నాయని, నేర ప్రవత్తి కలిగితే చర్యలు కూడా కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ప్రతీ విద్యార్థి క్రమశిక్షణ, మంచి నడవడిక కలిగి ఉండాలన్నారు. డ్రగ్స్ వినియోగించకూడదని హితవు పలికారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బి.షణ్ముఖరావు, కె.ఢిల్లేశ్వరరావు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఐటీడీఏను ఏర్పాటు చేయాలి : ఎమ్మెల్యే ఎంజీఆర్



**పాతపట్నం, నవంబర్ 18(వార్త):** జిల్లాల పునర్విభజనతో ఐటీడీఏను కోల్పోయామని, అత్యధికంగా గిరిజనులు ఉండే పాతపట్నం నియోజకవర్గంలో ఐటీడీఏను ఏర్పాటు చేయాలని ఆ నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన శాసనసభలో ఈ విషయాన్ని ప్రస్తావించారు. గిరిజన గ్రామాలకు సరైన రహదారులు లేక, అనారోగ్యం పాలైతే నేటికీ డోలీల సహాయంతోనే ఆసుపత్రికి తరలించాల్సిన దుస్థితి నేటికీ నెలకొందని వాపోయారు. మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడంతో పాటు అత్యంత వెనుకబడిన నియోజకవర్గానికి అధిక నిధులు కేటాయించి, అన్ని రకాలుగా అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు.

# శివాలయాలకు పోటెత్తిన భక్తులు





**జలుమూరు, నవంబర్ 18(వార్త):** దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖ లింగేశ్వర ఆలయానికి కార్తీక మూడో సోమవారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. అనేక ప్రాంతాల నుంచి వేలాది భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే క్యూలైన్లో భక్తులు బారులు దీరారని ఈవో ప్రభాకరరావు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

### సంగాం భక్త జన సంద్రం..

**వంగర:** సంగాం సంగమేశ్వరుని దేవాలయం సోమవారం భక్త జనసంద్రమైంది. కార్తీక మూడో సోమవారం సందర్భంగా ఆలయమంతా శివ నామ స్మరణతో మారుమోగింది. అర్ధరాత్రి నుండే భక్తజనంతో పాటు శివ, అయ్యప్పస్వాములు అధిక సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకుని, త్రివేణి సంగమంలో స్నానాలు ఆచరించి..శివునికి ఇష్టమైన, ప్రీతికరమైన పూజలు ఆలయ ప్రధాన అర్చకులు సిద్ధాంతం గణపతిరావు, అర్చకులు సిద్ధాంతం చిన్నబాబు సమక్షంలో జరిపారు. రాష్ట్రంలోని పలు జిల్లాలు, ఒడిశా ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పూజలనంతరం స్వామివారి ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ బోను ఆనందరావు, ఈవో శ్యామలరావు, డాక్టర్ ఉగిరి ముత్యాల రావు, బొడ్డోతు అప్పలనాయుడు, అర్చకులు తదితరులు అన్ని ఏర్పాట్లు జరిపారు.



### తాళ్లభద్ర ఆలయంలో ..

**సోంపేట:** కార్తీక మూడో సోమవారం సందర్భంగా సోంపేట మండలం తాళ్లభద్ర గ్రామంలో వెలసి ఉన్న తాంకేశ్వర ఆలయం భక్తులతో పోటెత్తింది. ఈ సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు భక్తులు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఎల్. శివస్వామి భక్తులకు ఆశీర్వదించారు.

# హైందవ శంఖారావం విజయవంతం చేయండి



**ఇచ్ఛాపురం, నవంబర్ 18(వార్త):** విశ్వహిందూ పరిషత్ జనవరి 5న విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం విజయవంతం చేయాలని ఆ సంస్థ కేంద్రీయ సంయుక్త కార్యదర్శి కోటేశ్వర శర్మ కోరారు.

చలో విజయ వాడ, 'దేవాలయాలు రక్షించుకుందాం' అనే కార్యక్రమ ముందస్తు సన్నాహక సమావేశం కవిటిలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ దేవాలయాలకు స్వయం ప్రతి పత్తి కల్పించాలని డిమాండ్ చేశారు. హైందవ శంఖారావంకు పెద్ద ఎత్తున హిందూవులు హాజరుకావాలని కోరారు. హిందూ సమాజాన్ని జాగృతం చేసి ఐక్యత దిశగా అడుగులు వేయడానికి సూచనలు చేశారు. దేవాలయాల నిర్వహణ హిందువులకు అప్పగించాలని కోరారు. అంతకుముందు ఆయన ఇచ్ఛాపురంలోని స్వేచ్ఛావతి అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

సమావేశంలో శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు ఎల్.ఆనం దరావు, రాంప్రసాద్ మాస్టర్, ఇచ్ఛా పురం, కవిటి మండలాల అధ్యక్షులు పాక తులసీదాస్, హిందూ బంధువులు పాల్గొన్నారు.

# ప్రకృతి సేద్యంతో ఆరోగ్యకరమైన జీవనం



**వంగర, నవంబర్ 18(వార్త):** ప్రకృతి సేద్యంతో పండించిన పంటలు మానవుని ఆరోగ్యానికి ఎంతో దోహద పడతాయని రాజాం రూరల్ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హెచ్.ఉపేంద్రరావు తెలిపారు. సోమవారం ఆయన కొప్పర కొత్తవలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయం రైతు పెంకి గౌరీశ్వరరావు పండిస్తున్న దేశవాళీ వరి తదితర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు గౌరీశ్వరరావు రసాయనాల పంటలకు దీటుగా దిగుబడులు సాధించడానికి పాటిస్తున్న ప్రకృతి సేద్య పద్ధతులను సీఐకి క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రైతులు క్రమేపీ రసాయనాలు తగ్గించి ద్రవ రూప సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలని కోరారు. రైతు పెంకి గౌరీశ్వరరావును ఆదర్శంగా తీసుకుని ప్రకృతి వ్యవసాయం చేసి పంట భూమిని కాపాడుకోని దేశీవాళీ పంట లను పండించాలని సూచించారు. కార్యక్రమంలో పెంకి చైతన్య కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## కమిటీలతోనే బీజేపీ బలోపేతం

**మందస, నవంబర్ 18(వార్త):** గ్రామాల్లో బూత్, మండల కమిటీలను తప్పక వేయాలని భారతీయ జనతాపార్టీ నాయకులు కోరారు. మందసలోని అన్నపూర్ణమ్మతల్లి ఆలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు పొందరదుదిష్టిపాత్రో అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదు ఎక్కువగా చేయాలని కోరారు. పార్టీ పటిష్టతకు కమిటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో హనుమంతు రామారావు, ఏఆర్వో వెంకటరావు, సభ్యత్వ జిల్లా కోకన్వీనర్ రౌతు చిరంజీవరావు, కిసాన్ మోర్చా జిల్లా వైస్‌ప్రెసిడెంట్, పలాస అర్బన్ ఆర్డీ రట్టి లక్ష్మణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి, జిల్లా ఆర్వో పాలవలస వైకుంఠరావు, క్రియాశీలక సభ్యుడు, బూత్ అధ్యక్షుడు శక్తికేంద్ర, ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య శిబిరం పరిశీలన



**జలుమూరు, నవంబర్ 18(వార్త):** శ్రీముఖలింగంలో మూడవ కార్తీక సోమవారం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ డా.సురేశ్ కుమార్ సోమవారం సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వైద్యాధికారి డా.సుజాత, ఆరోగ్య పర్యవేక్షకులు మెండ మోహనరావు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల విభాగానికి 60అర్జీలు




**కాశీబుగ్గ, నవంబర్ 18(వార్త):** పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 60అర్జీలు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. వ్యక్తిగత సమస్యలపై 36, పెన్షన్లు, రేషన్‌కార్డులు, టిడ్కో ఇళ్ల సమస్యలు పరిష్కారానికి 24 అర్జీలు అందాయన్నారు.

## కొట్టిశలో సత్యసాయిబాబా వేడుకలు

**వంగర, నవంబర్ 18(వార్త):** సత్యసాయిబాబా వారి 99వ జయంతి వేడుకల్లో భాగంగా సోమవారం కొట్టిశ గ్రామంలో సత్యసాయి సత్యన్నారాయణ సామూహిక వ్రతాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వంగర సత్యసాయి కన్వీనర్ బెవర రాములునాయుడు (సాయిరాం) మాట్లాడుతూ, మానవతా విలువలు కాపాడాలని పిలుపునిచ్చారు. స్వామి జయంతి వేడుకలు ఈ నెల 23న ప్రతి గ్రామంలో ఘనముగా నిర్వహించాలని కోరారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## రోడ్డు ప్రమాదంలో మరో వ్యక్తి మృతి

**ఇచ్ఛాపురం, నవంబర్ 18 (వార్త):** టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉయ్యాల వంశీకృష్ణ అనే యువకుడు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అంగురు కృష్ణ కూడా బెర్హంపూర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. భార్య దీపికకు ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా ఆదివారం రాత్రి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చారు. కొడుకు పుట్టాడన్న విషయం తెలియకుండానే తండ్రి మరణించాడు. కృష్ణ మృతితో కుటుంబీకులు కన్నీరుమున్నీరవుతున్నారు.

# పరిష్కార వేదికకు.. 73 అర్జీలు

*** అర్జీలు పెండింగ్‌లో లేకుండా చూడాలి * జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**శ్రీకాకుళం, నవంబర్ 18(వార్త):** అర్జీలు పెండింగ్‌లో లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికను సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అర్జీదారులు నుంచి కలెక్టర్‌తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అర్జీలు స్వీకరించారు. స్వీకరించిన అర్జీలలో అత్యధికంగా రెవెన్యూ సమస్యలపై 30, పంచాయతీ రాజ్ సమస్యలపై 12 అర్జీలను స్వీకరించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికకు 73 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ కిరణ్ కుమార్, జడ్పీ సీఈవో ఎల్.ఎన్.వి.శ్రీధర్ రాజ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



### నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి



ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని జనసేన మెళియాపుట్టి మండల నాయకులు సోమవారం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మెళియాపుట్టి మండలం చీపురుపల్లి పంచాయతీకి చెందిన నిర్వాసితులు పలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిర్వాసిత గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, వీధి దీపాలు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జనసేన మండల నాయకులు దుక్క బాలరాజు, తిరునగరి ప్రసాద్, చీపురుపల్లి సర్పంచ్ యవ్వారి ఈశ్వరరావు, అజయ్ దొర, శోభన్, విజయ్ దొర, మహేష్, చంద్రశేఖర్, రాజారావు ఉన్నారు.

### అర్జీదారులు సంతృప్తి చెందేలా ఫిర్యాదులు పరిష్కరించండి:ఎస్పీ

అర్జీదారులు సంతృప్తి చెందేలా ప్రజా ఫిర్యాదులు పూర్తి స్థాయిలో పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ (మీకోసం) కార్యక్రమంలో ప్రజల నుంచి 50 వినతలు స్వీకరించారు. వృద్ధులు, వికలాంగుల వద్దకు జిల్లా ఎస్పీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. భూ తగాదాల అంశాలపై 14, సివిల్ అంశాలపై 4, కుటుంబ కలహాలపై 8, పాత ఫిర్యాదులపై 10, మోసపూరితమైనవి అంశాలపై 3, ఇతరత్రా అంశాలపై 11 ఫిర్యాదులు వచ్చాయి.



# అపార్.. విద్యార్థికి కీలకం

*** ఆధార్‌లో తప్పలుంటే సరిదిద్దాలి**

*** జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**శ్రీకాకుళం, నవంబర్ 18(వార్త):** అపార్ నమోదు విద్యార్థికి భవిష్యత్తులో అత్యంత కీలకమని, విద్యార్థుల అపార్ ఐడీలు నమోదు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, విద్యాశాఖ, ఆర్ఐఓ, డివిఈవో, మున్సిపల్ కమిషనర్, కళాశాల ప్రిన్సిపాల్‌తో కలసి శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరుగుతున్న ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు జూనియర్ కళాశాలలు 114 ఉండగా అపార్ కార్డు నమోదు తక్కువ శాతం ఉందన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో 1277 మంది బాలికలకు అపార్ కార్డు నమోదు చేయవలసి ఉండగా తక్కువ శాతం నమోదు అయిందని చెప్పారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అపార్ ఐ.డి లు జనరేట్ చేయడంలో ఆధార్‌లో ఎటువంటి సమస్యలు ఉన్న త్వరితగతిన పరిష్కరించుకోవాలన్నారు. జిల్లాలో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు 'అపార్' నమోదు ప్రక్రియలో 80 శాతం పూర్తి చేశామని, మిగతాది పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య, ఆర్ఐఓ దుర్గారావు, డీవీఈవో తవిటి నాయుడు, మునిసిపల్ కమిషనర్ పీవీవీడి ప్రసాదరావు, బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కృష్ణవేణి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



## క్రిమినల్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించండి

*** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జూనైద్ అహ్మద్ మౌలానా**

**శ్రీకాకుళం లీగల్, నవంబర్ 18(వార్త):** లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులపై దృష్టి సాధించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జూనైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా కోర్టు భవనంలో సోమవారం జిల్లా పోలీస్, ఎక్సైజ్, లేబర్, విద్యుత్ శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 14న జరుగనున్న లోక్ అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ కేసులను ఎక్కువ చేయాలని కోరారు. జైల్లో గల ముద్దాయిలు గురించి చర్చిస్తూ వారి స్థితిగతులను త్వరితగతిన పరిష్కారం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో 1వ అదనపు జిల్లా జడ్జి పి.భాస్కర రావు, 4వ అదనపు జిల్లా జడ్జి ఎస్ఎం ఫణి కుమార్, జిల్లా కార్యదర్శి న్యాయ సేవాధికార సంస్థ ఆర్.సన్యాసి నాయుడు, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కె.ఎల్.వి.హిమబిందు, ఎక్సైజ్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, జైలు అధికారులు పాల్గొన్నారు.

## నేడు ఆదిత్యుని హుండీ లెక్కింపు

**అరసవల్లి, నవంబర్ 18(వార్త):** అరసవల్లి సూర్య నారాయణ స్వామి దేవస్థానం హుండీలను మంగళవారం ఉదయం 8 గంటలకు లెక్కించనున్నామని ఉప కమిషనర్ భద్రాజి ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ సిబ్బంది, అనువంశిక ధర్మకర్త, పాలక మండలి సభ్యులు, అర్చకులు, భక్తులు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీలను తెరవనున్నామన్నారు.

## ఏఎస్పీగా కేవీ రమణ

**శ్రీకాకుళం క్రైం, నవంబర్ 18 (వార్త):** శ్రీకాకుళం జిల్లా పోలీసు శాఖ అదనపు ఎస్పీ (అడ్మిన్)గా కేవీ రమణ సోమవారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లా అదనపు ఎస్పీగా బదిలీపై వచ్చారు. అదేవిధంగా జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా జి.సీతారామారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత వీరిద్దరూ ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కలను అందజేశారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

**మెళియాపుట్టి నవంబర్ 18 (వార్త):** ద్విచక్ర వాహనం ఢీకొని మెళియాపుట్టి గ్రామానికి చెందిన బత్తుల నాగేశ్వరరావు (55) అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే పూండి పర్లాకిమిడి రోడ్డులో వెలుగు కార్యాలయానికి దగ్గరలో సోమవారం రాత్రి నాగేశ్వరరావు రోడ్డు దాటుతున్న క్రమంలో ఒడిస్సా ప్రాంతానికి చెందిన వ్యక్తి ఎస్.బారిక (40) మద్యం సేవించి ద్విచక్ర వాహనంతో ఢీకొన్నాడు. దీంతో నాగేశ్వరరావుకు ఎడమ కాలుకు పూర్తిగా గాయమైంది. ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తికి కూడా గాయాలు కావడంతో వీరిద్దరినీ 108 వాహనంలో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

కవిటి మండలంలోని బెలగాం గ్రామానికి చెందిన జి.ధనుంజయ (30) తునిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ధనుంజయ తునిలో డ్రైవరుగా ఉన్నాడు ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెలుతుండగా బోల్తాపడడంతో ఆయనకు గాయాలయ్యాయి. స్థానికులు ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. ధనుంజయకు భార్యలతతోపాటు రెండేళ్ల పాప ఉన్నారు.

## తెప్ప బోల్తాపడి మత్స్యకారుడి మృతి

**రణస్థలం, నవంబర్18(వార్త):** అల్లివలస గ్రామానికి చెందిన మత్స్యకారుడు వి.అనిల్‌కుమార్ (34) తెప్పబోల్తా పడి మృతి చెందాడు. అనిల్ కుమార్‌తో పాటు మరో ఇద్దరు చేపల వేట నిమిత్తం సముద్రంలోకి సోమవారం వేకువజామున వెళ్లారు. వేట ముగించుకుని ఒడ్డుకు చేరే సమయంలో అలల ధాటికి తెప్ప బోల్తా పడింది. తెప్పకింద అనిల్‌కుమార్ ఉండి పోవడంతో ఊపి రాడక మృతి చెందాడు. మరో ఇద్దరు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. మృతుడికి భార్య లక్ష్మి, బాబు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం పోలీసులు కేసు నమోదు చేశారు.

## పురుగుల మందు తాగి ఆత్మహత్య

**పలాస, నవంబర్18(వార్త):** టెక్కలిపట్నం గ్రామానికి చెందిన కె.పాపారావు(62) సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పాపారావు ఆదివారం ఉదయం పొలానికి వెళ్లి ఎంతసేపటికి కూడా ఇంటికి రాలేదు. దీంతో కుటుంబీకులు పొలానికి వెళ్లగా అపస్మారక స్థితిలో పాపారావు పడివున్నాడు. 108 వాహనంలో శ్రీకాకుళం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ పోలీసులు తెలిపారు.

## దువ్వాడపై పోలీసులకు జనసేన నేతల ఫిర్యాదు

**టెక్కలి, నవంబర్18 (వార్త):** వైసీపీ ప్రభుత్వ హయాంలో జనసేన, టీడీపీ అధినేతలు పవన్ కళ్యాణ్, చంద్రబాబునాయుడులపై ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై జనసేన టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి కణితి కిరణ్ కుమార్‌తో పాటు పలువురు ఆ పార్టీ నేతలు సోమవారం టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దువ్వాడపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో జన సైనికులు గవరయ్య, కుమారస్వామి, త్రివేణి, రమణ, భాస్కర్, నరేష్, శోభన్, నాగ, అశోక్, గణేష్, శ్యామ్, వినోద్, అప్పల స్వామి, స్వాదీన్, జగదీష్, హరి ఉన్నారు.

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546